ట్రాఫికర్


తిరువూరు మెయిన్‌రోడ్డులో నిలిచిపోయిన ట్రాఫిక్

- తిరువూరులో రోడ్లపైనే ఆటోల పార్కింగ్
- ఫుట్‌పాత్‌ల ఆక్రమణ
- రాకపోకలకు ప్రయాణికుల ఇబ్బందులు

తిరువూరు: తిరువూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రతరమవుతోంది. 60 వేలకు పైగా జనాభా ఉన్న తిరువూరులో పలు రహదారులు ఇరుకుగా ఉండటంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. రోడ్ల పక్కనే వాహనాల పార్కింగ్‌తో అసలే ఇరుకుగా ఉన్న రోడ్లపై మరింత ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రద్దీగా ఉండే మెయిన్‌రోడ్డులో పార్కింగ్ స్థలాలు లేక పోవడంతో దుకాణాల ముందే ద్విచక్ర వాహనాలు, ఆటోలను నిలిపివేస్తున్నారు. బోస్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు మెయిన్‌రోడ్డు ఇరుకుగా ఉండటంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది.ఉదయం, సాయంత్రం పాఠశాలలు, కళాశాలలు వదిలే సమయంలో వ్యాన్లు, ఇతర వాహనాలు అధిక సంఖ్యలో ఒకేసారి ఎదురెదురుగా రావడంతో వాహన చోదకులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు.
పోలీసులు గతంలో ట్రాఫిక్ విధులకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించగా, ప్రస్తుతం అప్పుడప్పుడు మాత్రమే సిబ్బంది ట్రాఫిక్ విధులకు వస్తున్నారు.

వన్‌వే అమలులోనూ ఉదాసీనత..

తిరువూరు బోస్ సెంటర్ నుంచి చీరాల సెంటర్ వరకు నిత్యం వన్‌వే అమలు చేస్తున్నప్పటికీ ఆటోలు, మినీ వ్యాన్లు నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఆర్టీసీ బస్సులు సైతం వన్‌వే నిబంధనలు ఉల్లంఘిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తప్పట్లేదు. జైబావి సెంటర్, విశాలాంధ్ర రోడ్ల మీదుగా ఆటోవాలాలు మెయిన్ రోడ్డులోకి వస్తుండటంతో వన్‌వే అమలు నామమాత్రంగానే ఉందని పలువురు విమర్శిస్తున్నారు. ఆంధ్రా బ్యాంకు రోడ్డు, జంట సినిమా హాల్స్ రోడ్డు, జూనియర్ కళాశాల రోడ్లలో సైతం వాహనాల రద్దీ అధికంగా ఉన్నందున పోలీసులు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణ

మెయిన్ రోడ్డులో ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవడంతో వాహన చోదకులకు అసౌకర్యంగా ఉంటోంది. మలుపుల్లో వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలబారిన పడుతున్నారు. ఫుట్‌పాత్‌లు పాదచారులు నడవడానికి ఏమాత్రం అనువుగా లేకపోవడం, దుకాణాల సామాన్లు వీటిపైనే ఉంచడంతో అలంకారప్రాయంగా మిగిలాయి. ఇటీవల డ్రెయినేజీలు శుభ్రపరచడానికి ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించినప్పటికీ పరిస్థితి మళ్లీ యథాస్థితికి చేరింది. బోస్ సెంటరు నుంచి బైపాస్ రోడ్డు వినాయకుని దేవాలయం వరకు ఆక్రమణల తొలగింపు తర్వాత విశాలంగా కనిపించినా మళ్లీ ఆక్రమణల పాలవుతోందని పట్టణ ప్రజలు వాపోతున్నారు.

ట్రాఫిక్‌ను నియంత్రిస్తాం

తిరువూరు పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ఉదయం, సాయంత్రం రద్దీ వేళల్లో సిబ్బందిని నియమించి వాహనాల రాకపోకలను నియంత్రిస్తాం. వన్‌వే అమలుపై దృష్టి పెడతాం.

– వెంకటరావు, సెక్టార్–2 ఎస్ఐ, తిరువూరు



ఆక్రమణలు తొలగించాలి

రహదారుల వెంబడి ఆక్రమణలు తొలగించాలి. వాహనాల రాకపోకలకు వీలుగా బోస్ సెంటరు నుంచి బైపాస్ రోడ్డు వరకు ఆక్రమణల తొలగింపు జరిగినందున డ్రెయినేజీల వరకు రోడ్డు నిర్మించాలి.

– ఆనందరావు, తిరువూరు



ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలి

తిరువూరు పట్టణంలో నానాటికీ వాహనాల రాకపోకలు పెరుగుతున్నందున పోలీసులు ట్రాఫిక్ విధుల నియంత్రణకు సిబ్బందిని నియమించాలి. బోస్ సెంటర్ నుంచి చీరాల సెంటర్ వరకు వన్‌వే అమలు చేయాలి.

– కిశోర్, తిరువూరు

క్లుప్తంగా

నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా విక్రయాలు

ఇబ్రహీంపట్నం: గుంటుపల్లి, కొండపల్లి, ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణదారులు నిబంధనలు పాటించకుండా విక్రయాలు చేశారు. సాయంత్రం 5 గంటల వరకే అమ్మకాలకు అనుమతి ఉన్నప్పటికీ రాత్రి 9 గంటలకు వరకు పట్టాల చాటున వ్యాపారం చేశారు. దుకాణాల వద్ద పోలీసులు ఉండి వ్యాపారులకు కొమ్ము కాయడం విమర్శలకు దారితీసింది. దీనిపై తహసీల్దార్ వెంకటేశ్వర్లు స్పందిస్తూ బాణసంచా విక్రయాల్లో నిబంధనలు అతిక్రమించిన దుకాణదారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పరిశుద్ధ జపమాలతో పరలోకప్రాప్తి

రెవరెండ్ ఫాదర్ మేశపాం గాబ్రియేల్

తిరువూరు: పరిశుద్ధ జపమాలతో పరలోక ప్రాప్తి సాధ్యమని రెవరెండ్ ఫాదర్ మేశపాం గాబ్రియేల్ అన్నారు. తిరువూరు మధిర రోడ్డులోని ఆర్‌సీఎం చర్చిలో గత నెల రోజులుగా జరుగుతున్న పరిశుద్ధ జపమాల మాత పండుగ ముగింపు కార్యక్రమం శుక్రవారం రాత్రి నిర్వహించారు. సహాయ మాత విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ విజయకుమార్ జంగం ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక ప్రార్థన, దివ్య బలిపూజలో రెవరెండ్ ఫాదర్ జోసఫ్, ఫాదర్ గాబ్రియేల్ ప్రార్థనలు చేశారు.

బహుమతుల ప్రదానం

నూజివీడు: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన త్రివిధ హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని ముత్యాల సంజన, 8వ తరగతి విద్యార్థిని దీక్షిత జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిశోర్ చేతుల మీదుగా గురువారం నగదు బహుమతిని అందుకున్నారు. ఏలూరులో నిర్వహించిన కార్యక్రమంలో వీరిద్దరిని జిల్లా ఎస్పీ అభినందించారు. విద్యార్థినులను త్రివిధ హైస్కూల్ ప్రిన్సిపాల్ సబ్బినేని శ్రీనివాస్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మైలవరం: స్థానిక పెద దళితవాడలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారని చెప్పారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాట్ల పరిశీలన

విస్సన్నపేట: మండలంలోని కలగర గ్రామంలో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీఓ కె. మాధురి శుక్రవారం పరిశీలించారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. అనంతరం స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్‌ను ఆర్డీఓ పరిశీలించారు. తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణి పాల్గొన్నారు.

సైకిల్ షెడ్ ప్రారంభం

ఆగిరిపల్లి: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో చుక్కపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన సైకిల్ షెడ్‌ను ట్రస్ట్ అధినేత చుక్కపల్లి సుధ శుక్రవారం ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయిని పుష్పలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటు నమోదుపై ప్రచారం

ముసునూరు: గ్రాడ్యుయేట్స్ అందరూ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరుగా నమోదు చేయించుకోవాలని యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు జి.పద్మకిశోర్, జి.రాంబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం చెక్కపల్లి జెడ్పీ హైస్కూల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదుపై ప్రచారం చేశారు. హెచ్‌ఎం అబ్బాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

తిరువూరు: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తిరువూరు మండల యూనిట్ నూతన కార్యవర్గం శుక్రవారం ఎన్నికైంది. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బి. ప్రమీల, పి. నాగేశ్వరరావు, కోశాధికారిగా ఎం. ఏసుపాదం, సహాధ్యక్షులుగా ఎం. రవీంద్ర, టి ఉమాదేవి, గౌరవాధ్యక్షుడిగా షేక్ బాజీ ఎన్నికయ్యారు. 9 మంది కార్యదర్శులు, ఆరుగురు జిల్లా కౌన్సిలర్లను ఎన్నుకున్నారు.

ఇందిరాగాంధీకి నివాళి

మైలవరం: దేశ మాజీ ప్రధాని దివంగత ఇందిరా గాంధీ సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ బ్లాక్ వన్ అధ్యక్షుడు దోసపాటి గిరిధర్‌కుమార్ అన్నారు. ఇందిరాగాంధీ వర్ధంతి కార్యక్రమం మైలవరంలోని బోసు బొమ్మ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు పిట్టల నాగేశ్వరరావు, అన్నవరపు దుర్గారావు, శీలం సుధాకర్‌రెడ్డి, మసనం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

- **ముసునూరు:** తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, ఈఓపీఆర్డీ బీఏ సత్యనారాయణలు తదితరులు పాల్గొన్నారు.

కోడికత్తులు కలిగి ఉన్న వ్యక్తి అరెస్ట్

విస్సన్నపేట: నూజివీడు మండలం సుంకొల్లు గ్రామానికి చెందిన మారేపల్లి వెంకటేశ్వరరావు కోడికత్తులు కలిగి ఉండటంతో అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. నిందితుడి నుంచి 80 కోడి కత్తులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని చెప్పారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించాలి

సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నేత హరినాథ్

నూజివీడు: సూపర్ సిక్స్ హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటి అమలులో విఫలమైందని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దినవహి హరినాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చనందున ప్రజల నుంచి నిరసనలు వెల్లువెత్తడంతో సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఆడని నాటకం లేదని ఆరోపించారు. బుడమేరు వరదలకు విజయవాడలో 2.30 లక్షల మందికి పైగా ప్రజలు నిరాశ్రయులైతే బాధితులను పరామర్శించేందుకు పవన్ కల్యాణ్ ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. వ్యవసాయ మోటర్లకు విద్యుత్ మీటర్లు బిగించమని చెప్పిన వాగ్దానాన్ని చంద్రబాబు వమ్ము చేస్తూ అదానీ మెప్పు కోసం మీటర్లు బిగించడం రైతాంగ వ్యతిరేక చర్య కాదా అని ప్రశ్నించారు. ట్రూ అప్ చార్జీల పేరుతో రాష్ట్ర ప్రజలపై విద్యుత్ చార్జీల భారాలు మోపడం ప్రజా వ్యతిరేక విధానమని దుయ్యబట్టారు. రైతాంగానికి పంట పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామన్న చంద్రబాబు ఇప్పుడు నోరు ఎందుకు మెదపడం లేదని ప్రశ్నించారు. మహిళలకు ఉచిత బస్సు ఊసే లేదని, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తానన్న హామీ నేటికీ కార్యరూపం దాల్చలేదని విమర్శించారు. ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలు ప్రశ్నించాలని కోరారు.

ఆనందోత్సాహాలతో దీపావళి

నూజివీడు: దీపావళి పండుగను నూజివీడు, తిరువూరు, మైలవరం నియోజకవర్గ ప్రజలు గురువారం ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే నూతన వస్త్రాలను ధరించి పూజలు చేశారు. సాయంత్రం 5 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు బాణసంచా కాల్చారు. పిల్లలు, యువతీ యువకులు టపాసులు కాలుస్తూ సందడి చేశారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో స్టూడెంట్ మిత్ర ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. విద్యార్థినుల దాండియా నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి. డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్, ఏఓ బి.లక్ష్మణరావు, ఫ్యాకల్టీ మెంబర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

- **మైలవరం:** స్థానిక కోట వెనుక కోట మహాలక్ష్మి ఆలయం సమీపంలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వరుసగా మూడో ఏడాది కూడా నరకాసురుడి గడ్డి బొమ్మను దహనం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మండలంలో ఘనంగా దీపావళి వేడుకలు జరిగాయి. ఉత్సాహంగా బాణసంచా కాల్చారు.
- **విస్సన్నపేట:** మండలంలో అన్ని గ్రామాల్లో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇళ్ల ముందు దీపాలను అందంగా అలంకరించారు. దేవాలయాల్లో, గృహాల్లో ప్రత్యేక పూజలు, లక్ష్మీపూజ నిర్వహించారు. బాణసంచా కాల్చి వేడుకగా దీపావళి నిర్వహించారు.


నూజివీడు ట్రిపుల్ ఐటీలో దాండియా నృత్యాలు


మైలవరంలో కాలుస్తున్న క్రాకర్స్

హ్యాండ్ బాల్ రాష్ట్ర జట్టుకు జెడ్పీ విద్యార్థుల ఎంపిక

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో కొండపల్లి జెడ్పీ బాలుర పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారని పాఠశాల హెచ్‌ఎం శేషగిరిరావు శుక్రవారం తెలిపారు. అక్టోబర్ 28, 29, 30 తేదీల్లో తెనాలిలో జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. అండర్ 14 బాలుర విభాగంలో ఐదుగురు, బాలికల విభాగంలో ఒకరు, అండర్ 17 బాలుర విభాగంలో ఐదుగురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను, పీఈటీలు పవన్‌కుమార్, రాజశేఖర్‌ను అభినందించారు.

- **నూజివీడు:** మండలంలోని దిగవల్లి హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న కె.హేమలత రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ ఖోఖో పోటీలకు ఎంపికైందని హెచ్‌ఎం ఆర్. శోభారాణి శుక్రవారం తెలిపారు. ఇటీవల గుడివాడలో నిర్వహించిన జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టుకు ఎంపికైందన్నారు. హేమలతను హెచ్‌ఎంతో పాటు వ్యాయామోపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.


విద్యార్థిని హేమలతతో హెచ్‌ఎం


ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం శేషగిరిరావు తదితరులు

పంట పెట్టుబడి సాయం కోసం 4న నిరసన

నూజివీడు: ఎన్నికల ముందు చంద్రబాబు రైతులకు ఇచ్చిన హామీ మేరకు పంట పెట్టుబడి సాయం రూ.20 వేలను వెంటనే విడుదల చేయాలని రైతు సంఘం నూజివీడు నియోజకవర్గ కార్యవర్గం డిమాండ్ చేసింది. స్థానిక అమర్ భవన్‌లో శుక్రవారం రాయంకుల లక్ష్మణరావు అధ్యక్షతన రైతు సంఘం సమావేశం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ పెట్టుబడి సాయం రూ.20 వేలను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని, నియోజకవర్గంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని కోరారు. రైతు సాయం విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 4న నూజివీడు నియోజకవర్గంలోని సచివాలయాల వద్ద అధికారులకు మెమోరాండం అందజేస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి మద్దతు ధరను పెంచేలా చూడాలన్నారు. రైతు సంఘం జిల్లా నాయకులు నిమ్మగడ్డ నరసింహారావు, అక్కినేని రాజా, నియోజకవర్గ కార్యదర్శి నాగేంద్రరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కూచిపూడి నాగేశ్వరరావు, వలసపల్లి ఆనందరావు, ముసునూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన పెన్షన్ల పంపిణీ

తిరువూరు: సర్వర్ మొరాయించడంతో శుక్రవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ తిరువూరు మండలంలో నత్తనడకన సాగింది. ఉదయం 5 గంటలకే సచివాలయ సిబ్బంది పెన్షన్ల పంపిణీ విధులకు హాజరుకాగా, సుమారు 4 గంటల పాటు పేమెంట్ సర్వర్ పనిచేయలేదు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతు మహిళలు తమకు పెన్షను బట్వాడా కాకపోవడంతో ఆందోళనకు గురై సచివాలయాల వద్దకు చేరారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వచ్చి పెన్షను ఇస్తామని సిబ్బంది సర్దిచెప్పి పంపారు. సాయంత్రానికి 85 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తయింది.

- **చాట్రాయి:** మండలంలో 85 శాతం పెన్షన్లు పంపిణీ చేశామని ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. 8,365 మంది పెన్షన్ దారులు ఉండగా 7,189 మందికి పెన్షన్లు పంపిణీ చేశామన్నారు.

ఎంపీపీ పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓలు

సాక్షి ఎఫెక్ట్

కిలేశపురం(ఇబ్రహీంపట్నం): కొత్త జూపూడి మండల పరిషత్ మోడల్ పాఠశాలను మండల విద్యా శాఖాధికారి సీహెచ్ పుష్పలత, ఎంఈఓ–2 శ్యామ్ రత్నబాబు శుక్రవారం సందర్శించారు. అక్టోబర్ 27న 'గురువులు ఇలా..చదువులు ఎలా' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా విద్యా శాఖాధికారి యు.సుబ్బారావు పాఠశాలలో విచారణ జరపాలని ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు ఇద్దరు ఎంఈఓలు పాఠశాలను వేర్వేరుగా సందర్శించారు. ఉపాధ్యాయుల మధ్య జరుగుతున్న ఆధిపత్య పోరు, వివాదాలు, ఉపాధ్యాయుల సెలవులపై టీచర్ల వివరణ తీసుకున్నారు. ఇక నుంచి సమన్వయంతో పనిచేస్తామని ఉపాధ్యాయుల మధ్య ఒప్పందం కుదిర్చారు. పాఠశాలపై తయారు చేసిన నివేదికను వారు జిల్లా ఉన్నతాధికారులకు పంపనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: పట్టణంలోని బంగినపల్లితోట, సమతా నగర్ ఏరియాల్లో కొత్త లైన్ల ఏర్పాటు నిమిత్తం శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ ఎ.సత్యనారాయణ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

- **ముసునూరు:** అక్కిరెడ్డిగూడెం గ్రామంలో శనివారం మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ జేఈ కేవీ సుబ్బారావు తెలిపారు. గుడిపాడు సబ్ స్టేషన్ పరిధిలో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా తెల్లవారు జాము 4 నుంచి ఉదయం 9 గంటల వరకు ఉంటుందని, అనంతరం సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం

మైలవరం: ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం, పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మైలవరం నూజివీడు రోడ్డులోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు వారికి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన సేవలు, త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం మండల నాయకులు బయన శ్రీనివాసరావు, కాజా మహేష్, కేతేపల్లి సూరిబాబు, జూలకంటి ప్రసాద్, చలవాది రాధాకృష్ణ, జూలూరు ఉమా, అనుమోలు గాంధీ, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

- **చాట్రాయి:** ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని మండలంలోని తుమ్మగూడెం ఉర్దూ పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు రాష్ట్ర అవతరణకు చేసిన కృషిని స్కూల్ హెచ్‌ఎం జి.వెంకట్రావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డైరీలను పంపిణీ చేశారు.
- **తిరువూరు:** స్థానిక రుక్మిణీ కృష్ణ ఆర్యవైశ్య కల్యాణ మండపం ఆవరణలోని అమరజీవి విగ్రహానికి ఆర్యవైశ్య ప్రముఖులు కంచర్ల ముత్యప్రసాద్, గుడిమెట్ల మురళి, కొత్తగుండ్ల ప్రసాదరావు, గజ్జల సీతారామారావు, సోమవరపు సత్యనారాయణ, కొత్తగుండ్ల హనుమంతరావు, జ్వాలా నరసింహారావు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి త్యాగాలను కొనియాడారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు

గంపలగూడెం: వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడితే సహించేది లేదని, వారికి అండగా నిలబడి పోరాడతామని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. గంపలగూడెం మండలంలోని మేడూరులో ఇటీవల టీడీపీ కార్యకర్తల దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న గ్రామ మాజీ సర్పంచి బరిగెల నాగేశ్వరరావు కుమారుడు రామకృష్ణను శుక్రవారం స్వామిదాసు పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ఇటువంటి దాడులకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని, పోలీసులు అధికార పార్టీ నాయకులకు కొమ్ము కాస్తే తగు రీతిలో పోరాడతామని హెచ్చరించారు. రామకృష్ణపై దాడి ఘటనను మసిపూసి మారేడుకాయ చేయడానికి పోలీసులు సైతం ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గంపలగూడెం మండలం గోసవీడులో పోలీసులు అక్రమ కేసులు బనాయించి పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పి వేధిస్తున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు గద్దల జయరాజు, గద్దల వినోద్, గద్దల మోహనరావు, మోషేలను స్వామిదాసు పరామర్శించారు. అక్రమ కేసులు బనాయిస్తే సహించబోమని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు మందపాటి ఉమామహేశ్వరరెడ్డి, శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మేడూరులో రామకృష్ణను పరామర్శిస్తున్న స్వామిదాసు, నాయకులు

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

డీఎంహెచ్‌ఓ సుహాసిని

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని డీఎంహెచ్‌ఓ ఎం. సుహాసిని అన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని చెప్పారు. కొండపల్లిలో శుక్రవారం ఆమె ఆకస్మికంగా పర్యటించారు. ఫ్రై డే డ్రై డేలో భాగంగా పట్టణంలోని పలు ఇళ్లను పరిశీలించారు. అవగాహన లోపంతో ఖాళీ కొబ్బరి బొండాలు, పాత టైర్లు, డబ్బాలు, రోళ్లలో నిల్వ ఉన్న నీటిని తీసివేయించారు. ఆమె మాట్లాడుతూ నిల్వ నీటితో దోమల లార్వా ద్వారా దోమల ఉత్పత్తి పెరిగి వ్యాధులు వ్యాపిస్తాయని చెప్పారు. నివాస ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కొండపల్లి మున్సిపాల్టీతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. వైద్య సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పీహెచ్‌సీలో 24 గంటల వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ ఆర్.పద్మావతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


కొండపల్లి పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ సుహాసిని

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు

తిరువూరు: కార్తికమాసంలో శైవ క్షేత్రాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం తిరువూరు నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని ఆర్టీసీ డిపో మేనేజర్ ఎ. సుబ్రహ్మణ్యం తెలిపారు. పంచారామాలైన అమరావతి, పాలకొల్లు, భీమవరం, సామర్లకోట, ద్రాక్షారామంలకు ప్రతి ఆది, సోమవారాల్లో తెల్లవారు ఝామున రెండు గంటలకు ప్రత్యేక బస్సులు బయల్దేరి దర్శనానంతరం మరుసటి రోజు ఉదయం 4 గంటలకు తిరువూరు చేరుకుంటాయని చెప్పారు. శ్రీశైలం, అన్నవరం పుణ్యక్షేత్రాలకు ప్రతి శని, ఆదివారాల్లో ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని చెప్పారు. శనివారం నుంచి ఈ బస్సులు ప్రారంభమవుతాయన్నారు. పూర్తి వివరాలకు తిరువూరు డిపో మేనేజర్ కార్యాలయంలో కానీ, సెల్ 98856 61835 నంబర్‌లో కానీ సంప్రదించాలని కోరారు.

నూజివీడు డిపో నుంచి..

నూజివీడు: నూజివీడు డిపో నుంచి పంచారామాలకు ప్రత్యేక సర్వీసులను ఏర్పాటుచేశారు. ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు సూపర్ లగ్జరీ సర్వీసు బస్సు నూజివీడు నుంచి బయలుదేరుతుంది. అమరావతి, భీమవరం, ద్రాక్షారామం, పాలకొల్లు, సామర్లకోటల్లోని శైవక్షేత్రాలను దర్శించుకొని తిరిగి సోమవారం రాత్రి 10 గంటల కల్లా నూజివీడు చేరుతుంది.

అరుణాచలానికి సర్వీసులు..

నూజివీడు డిపో నుంచి అరుణాచలానికి సూపర్ లగ్జరీ బస్సు సర్వీసు ఏర్పాటు చేశారు. ఈ బస్సు మధ్యలో కాణిపాకం, గోల్డెన్ టెంపుల్స్‌కు తీసుకెళ్తుంది.

త్రిలింగ దర్శిని ప్యాకేజీ..

ఉమ్మడి కర్నూలు జిల్లా శ్రీశైలం, మహానంది, యాగంటి ఆలయాలకు ఒకటిన్నర రోజులో వెళ్లి వచ్చేలా నూజివీడు డిపో నుంచి త్రిలింగదర్శిని ప్యాకేజీని సిద్ధం చేశారు. టిక్కెట్ రూ.1900గా నిర్ణయించారు. శ్రీశైలంకు నూజివీడు నుంచి ప్రతి రోజూ ఉదయం 8 గంటలకు, 10 గంటలకు బస్సులు ఉన్నాయి.

వృత్తిదారులను మోసం చేస్తున్న పాలక పక్షాలు

చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు

మైలవరం: వృత్తిదారులను పాలక పక్షాలు మోసం చేస్తున్నాయని చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అన్నారు. చేతి వృత్తిదారుల సమాఖ్య ఎన్టీఆర్ జిల్లా ప్రథమ మహాసభ మైలవరంలోని మారుతి కల్యాణ మండపంలో జిల్లా నాయకులు బుద్దవరపు వెంకట్రావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. చేతి వృత్తిదారుల సమాఖ్య సీనియర్ నాయకులు దుట్టేటి చంద్రయ్య పతాకా విష్కర చేశారు. ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి డి. సూరిబాబు, కేవీ భాస్కరరావు విప్లవ గీతాలు ఆలపించారు. రామాంజనేయులు మాట్లాడుతూ వృత్తిదారులను పాలకపక్షాలు ఎన్నికల సమయంలో ఓటు బ్యాంకు వలే చూస్తున్నాయని, వారి సమస్యలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వీరిని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేస్తామని హామీలిస్తూ మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రధాని నరేంద్ర మోదీ పదేళ్ల పాలనలో కేవలం 19 రకాల చేతి వృత్తిదారులకు మాత్రమే విశ్వకర్మ యోజనలో నామ మాత్రపు పథకాలు ప్రకటించారన్నారు. చంద్రబాబు సంక్షేమానికి పెద్దపీట వేస్తానని చెప్పి అధికారంలోని వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా చేతి వృత్తిదారులను ఆదుకునేందుకు ఎలాంటి కార్యాచరణ ప్రకటించలేదని విమర్శించారు. చేతి వృత్తిదారులకు మారిన నూతన సాంకేతిక, యంత్ర పరికరాలు సమకూర్చి ఆయా వృత్తులను కొనసాగించేలా ప్రభుత్వాలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.


మహాసభలో మాట్లాడుతున్న దోనేపూడి శంకర్

ఘనంగా ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం

నూజివీడు: దేశ వ్యాప్తంగా కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేసే వేదిక ఏఐటీయూసీ అని సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు అన్నారు. ఏఐటీయూసీ 105వ వ్యవస్థాపక దినోత్సవాన్ని స్థానిక పెద్ద గాంధీ బొమ్మ సెంటర్‌లో గురువారం నిర్వహించారు. ఏఐటీయూసీ పతాకాన్ని ఎగురవేసి ఆయన మాట్లాడారు. దేశంలో తొలి జాతీయ కార్మిక సంఘం ఏఐటీయూసీ అన్నారు. అనేక ఆందోళనలు చేసి 44 చట్టాలను సాధించిన చరిత్ర ఏఐటీయూసీకే దక్కుతుందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రానున్న కాలంలో అనేక పోరాటాలు చేస్తామన్నారు. ఏఐటీయూసీ నూజివీడు నియోజకవర్గ అధ్యక్షుడు అక్కినేని ఆంజనేయ ప్రసాద్, హెచ్‌పీ గ్యాస్ యూనియన్ కార్యదర్శి వేణుగోపాలరావు, ముఠా యూనియన్ అధ్యక్షులు ఎం. శ్రీనివాసరావు, కార్యదర్శి కె.కృష్ణ, రైతు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


ఏఐటీయూసీ పతాకాన్ని ఎగురవేసి నినాదాలు చేస్తున్న రామారావు తదితరులు